ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 13.10.2026 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాసం కొరత రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. నీటి లభ్య త ఉన్న చెరువులు, కుంటల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయించింది.

2. ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశమై , తెలంగాణలోని కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులపై చర్చించారు.

3. రాజ్యాంగ వ్యవస్థలను బెదిరించే స్థాయికి కాంగ్రెస్ దిగజారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు.

4. ఈరోజు, రేపు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని , ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది.

## ఎల్ నినో

ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాసం కొరత రాకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. నీటి లభ్యత ఉన్న చెరువులు , కుంటల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయించింది. 45 రోజుల్లో పశుగ్రాసం అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. హైదరాబాద్ సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. ఒక్కో ప్రాంతంలో ఐదు నుంచి పది ఎకరాల్లో గ్రాసం సాగు చేస్తారు. నిధులు ఉపాధి హామీ పథకం నుంచి కేటాయిస్తారు. విత్తనాలను పశుసంవర్ధక శాఖ ఉచితంగా ఇస్తుంది. నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. పశువుల కోసం నీటి తొట్టెలూ ఏర్పాటు చేస్తారు.

డెస్క్

## బోనస్

ఉపాధి హామీ పథకం ఎఫ్‌టీఈ ఉద్యోగులకు గ్రాట్యుటీ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో 3 వేల 800 మంది ఉద్యోగులకు ఆర్థిక భరోసా లభించనుంది. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చొరవతో 20 ఏళ్ల ఉద్యోగుల పోరాటానికి ఫలితం దక్కింది. ఈ జీవో ప్రకారం , ఉద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో కనీసం నాలుగు లక్షల రూపాయల గ్రాట్యుటీ అందుతుంది. పదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారికి కనీసం పది లక్షల రూపాయల వరకు ప్రయోజనం కలగనుంది. ఇరవై ఏళ్ల కల సాకారమైందంటూ ఉద్యోగుల సంఘం మంత్రి

సీతక్కకు కృతజ్ఞతలు తెలిపింది. ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

డెస్క్

**కోమటిరెడ్డి**

ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశమై , తెలంగాణలోని కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులపై చర్చించారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు గడ్కరీ ఆమోదం తెలిపారని, కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి శంకుస్థాపన ప్రతిపాదనకూ అంగీకారం తెలిపారని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. దీనివల్ల ఎన్‌హెచ్-167కె పై తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ అనుసంధానం పెరిగి , రవాణా, పర్యాటకం మెరుగుపడతాయన్నారు.

డెస్క్

**శ్రీధర్‌బాబు**

ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత , మన్నిక పెంచే దిశగా చినిగిపోకుండా , నీళ్లు పడినా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈరోజు ప్రారంభించారు. ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి. రవికిరణ్ తో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ప్రెస్ నోట్

**బీజేపీ చీఫ్**

రాజ్యాంగ వ్యవస్థలను బెదిరించే స్థాయికి కాంగ్రెస్ దిగజారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. సుప్రీంకోర్టుపై కాంగ్రెస్ , రాహుల్ గాంధీ నాటకీయ వైఖరిని ఖండిస్తూ హైదరాబాద్‌లోని హైకోర్టు బార్ కౌన్సిల్ గేట్ వద్ద న్యాయవాదులు చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో కాంగ్రెస్ విష ప్రచారం చేస్తోందని ఆరోపించారు. సుప్రీంకోర్టు , ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగ సంస్థలపై అందరికీ గౌరవం ఉండాలన్నారు.

డెస్క్

**సర్**

ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు కోసం ఒక్కో ఓటరు దాఖలు చేసే ఫారం-7 దరఖాస్తులపై కేంద్ర ఎన్నికల కమిషన్ పరిమితులు విధించింది. తగిన ఆధారాలు లేకుండా పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు దాఖలు చేస్తుండటంతో, సంబంధిత ఓటర్లకు ఇబ్బంది కలుగుతోందని, క్షేత్రస్థాయి సిబ్బందిపై పనిభారం పెరుగుతోందని కమిషన్ పేర్కొంది. ఈ మేరకు , క్లెయిములు, అభ్యంతరాల మొత్తం కాలంలో ఒక ఓటరు గరిష్ఠంగా పది ఫారం-7 దరఖాస్తులే ఇవ్వవచ్చు. ఓటర్ల జాబితా నిరంతర సవరణ కాలంలో నెలకు ఐదు మాత్రమే అనుమతిస్తారు.

డెస్క్

**మంత్రులు**

కృష్ణా నదిపై నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జి శంకుస్థాపనకు రావాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు

ఆహ్వానించారు. ఈ మేరకు వారు ఢిల్లీలో గడ్కరీతో భేటీ అయ్యారు. ఇందుకు ఆయన అంగీకారం తెలిపారు.

డెస్క్

**సీఎండీ**

విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేయడం , ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని 21 సర్కిళ్లలో ప్రజా బాట కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. సంస్థ సీఎండీ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా 11 కేవీ ఫీడర్లపై లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శుభ్రత, ఎర్తింగ్ తనిఖీలు, దెబ్బతిన్న పరికరాల మార్పిడి వంటి నిర్వహణ పనులు చేపట్టారు.

**డెస్క్**

**ఎపిక్**

పట్టభద్రుల నియోజకవర్గాల ఓటర్ల నమోదుకు ఎపిక్ నంబర్ వివరాలు ఇవ్వాలని పట్టుబట్టవద్దని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఎపిక్ నంబర్ ఇవ్వలేదన్న ఒక్క కారణంతో ఫారం-18 దరఖాస్తులను తిరస్కరించరాదని స్పష్టం చేశారు.

డెస్క్

**వాతావరణం**

ఈరోజు, రేపు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

పీఎస్

**నషా ముక్త్ భారత్**

రాజన్న సిరిసిల్ల జిల్లా , దేశాయిపల్లిలో కేంద్ర యువజన వ్యవహారాలు , క్రీడల మంత్రిత్వ శాఖ పరిధి లోని మై భారత్ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల వల్ల ఆరోగ్యం , కుటుంబం, సమాజంపై పడే దుష్ప్రభావాలు, పునరావాస మార్గాలపై నిపుణులు వివరించారు.

పిటిసి, సిరిసిల్ల

**సదుపాయాలు**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ధర్మకర్తల మండలి చైర్మన్ మన్నె సత్యనారాయణ తెలిపారు. ధర్మకర్తల మండలి మూడో సమావేశంలో పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

పిటిసి, యాదాద్రి

**ఎల్ నినో**

ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిశాయని , భూగర్భ జలాలు

తగ్గుతున్నాయని పరికి బదులు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ సూచించారు. వరదవెల్లి గ్రామంలో రైతు కడుదుల రాజు - అంజలి దంపతులు సాంప్రదాయ వరి సాగును వదిలి వినూత్నంగా 3.5 ఎకరాల్లో ఆయిల్ పామ్ లో అంతర పంటగా బెండకాయ, టమాట, మిర్చి, కాలీఫ్లవర్ తో పాటు బంతి, పట్టుకుచ్చులు, వేరుశెనగ సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వారి క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ పరిశీలించి అభినందించారు.

పిటిసి, సిరిసిల్ల

**భద్రకాళి రథం**

భద్రకాళి దేవాలయంలో రథోత్సవ ఏర్పాట్లను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఈరోజు పరిశీలించారు. వివరాలను ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు , ఆలయ కార్య నిర్వహణాధికారి సునీతను అడిగి తెలుసుకున్నారు.

పిటిసి, వరంగల్

**ప్రసవాలు**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు. కోనరావుపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని , నిమ్మపెల్లి ఉప కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు.

పిటిసి, సిరిసిల్ల

**పురోగతి**

జోగులాంబ గద్వాల జిల్లాలో సామాన్య రైతులు సైతం వ్యవసాయ , అనుబంధ రంగాల్లో ఆర్థికంగా పురోగతి సాధించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజనను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. ఢిల్లీలో నిన్న జరిగిన పీఎం డీడీకేపై ఒక సంవత్సరం మైలురాయి వేడుకల్లో కలెక్టర్ నేతృత్వంలోని అధికారుల బృందం పాల్గొంది.

పిటిసి, గద్వాల